

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 29 | సంచిక : 8 | ఏప్రియల్ 2024

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .


రామకృష్ణుడు - లాటుమహరాజ్ - అనుబంధం .. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 6

భగవద్గీత ....................................... 23

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



ఆత్మ గురించి విసుగు వచ్చేలా
శ్రవణం చెయ్యండి, అప్పుడు
మననం జరుగుతుంది. ఆ వస్తువు
పట్ల మీకు ప్రీతి కలుగుతుంది.
అప్పుడు ఆత్మ గురించి
తెలుసుకోవాలి అనే కాంక్ష
మీ లోపల నుండి
పుట్టుకొని వస్తుంది.
ఆత్మను తెలుసుకోవాలి అనే కాంక్ష మీ హృదయం నుండి
వచ్చినప్పుడు ఆత్మను తెలుసుకోగలుగుతారు.



# రామకృష్ణుడు - లాటుమహరాజ్ - అనుబంధం

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

రామకృష్ణపరమహంస గారి 16 మంది శిష్యులలో లాటుమహారాజ్ ఒకరు. ఆయనకి చదువు రాదు. స్వామి వివేకానంద అన్నాడు చదువు లేకపోయినా నీకు ఆత్మానందం వచ్చేసింది. నువ్వు అద్భుతంగా అనుభవిస్తున్నావు లోపలున్న ఆనందాన్ని, అందుచేత నీపేరు అద్భుతానంద అన్నాడు. BA, MA లు చదివిన వాళ్లకెవరికీ అద్భుతానంద అని పేరు పెట్టలేదు, ఈయనకి పెట్టేసాడు. ఒకోసారి మా చదువులే మాకు అడ్డు వస్తున్నాయి. నువ్వు మామూలు ఆనందం అనుభవించటం లేదు, అద్భుతమైన ఆనందం అనుభవిస్తున్నావు, దేహ స్పృహ లేకుండా ఉంటున్నావు, అందుచేత నీపేరు అద్భుతానంద అన్నాడు.

రామకృష్ణపరమహంస గారి చివరి రోజులలో అద్భుతానంద ఆయనకి అద్భుతంగా సేవ చేసాడు. గురువుగారూ చదువుకున్న వాళ్ళందరూ చదువుకునే పనులు చేస్తున్నారు, మరి నాకు చదువు లేదు, మీ గది తుడిచేస్తాను అనేవాడు. టాయిలెట్ శుభ్రంగా కడిగేసేవాడు, కాళ్ళు నొక్కేవాడు. మీ మాటలు అందరికీ చెపుదామంటే నాకు చదువు రాదు, మీ మాటలు రాయలేను, మీ గురించి నలుగురికి చెప్పలేను. మరి ఏదో ఒక పని చెయ్యాలి కదా, మీ దేహానికి సేవ చేస్తాను అని సేవ చేసేవాడు రామకృష్ణుడికి. వాడి డెస్టినీ (ప్రారబ్ధం) చూడండి.

ఈశ్వరుడి యొక్క లీల చూడండి. లాటూ బీహారు వాడు. అతనికి చదువు లేదు. కలకత్తాలో ఒక ధనవంతుడు తీసుకొచ్చి నౌకరుగా పెట్టుకున్నాడు. ఆ ధనవంతుడు రామకృష్ణుడికి మామిడిపళ్ళు, తినే పదార్ధాలు వీడి ద్వారా పంపేవాడు. అలా వాడికి అదృష్టం కలిసి వచ్చింది. రామకృష్ణుడు అంటే ఎవరో తెలియదు అద్భుతానందకి. ఆ యజమాని పళ్ళు అవీ ఇచ్చి దక్షిణేశ్వరంలో గురువుగారికి ఇచ్చిరమ్మంటేఐదు మైళ్ళు నడిచి వెళ్లి ఇచ్చి తిరిగి ఐదు మైళ్ళు వచ్చేవాడు. అలా పది మైళ్ళు వెళ్ళేవాడు. అలా వెళ్ళినప్పుడు రామకృష్ణుడిని చూసి ఆయన మీద ప్రేమ కలిగింది. మీదగ్గర ఉద్యోగం మానేస్తాను, పరమహంస గారిని వదిలి ఉండలేను అని యజమానితో చెప్పాడు. రామకృష్ణపరమహంస గారు "ఆయన నిన్ను పోషిస్తున్నాడు కదా, ఉద్యోగం మానేస్తే మరి నీకు పొట్ట ఎలా వెళ్తుంది" అని అడిగితే అద్భుతానంద "ఇక్కడ రెండు ఆలయాలు ఉన్నాయి. కృష్ణుడి ఆలయం, కాళికాలయం. ఆ రెండు ఆలయాలలో ప్రసాదాలతో పొట్ట వెళ్ళిపోతుంది. కళ్ళతోటి మిమ్మల్ని చూసి ఆనందిస్తాను. లోపల ఏదో ఉంది అంటున్నారు నాకా గొడవ లేదు. మీ రూపం చూస్తేనే నాకు ఆనందం వస్తోంది. మిమ్మల్ని చూసి ఆనందిస్తాను" అని చెప్పాడు. ఉద్యోగం మానొద్దు అని చెప్పినా, మానేసి దక్షిణేశ్వరంలో ఉండిపోయాడు.

చివరి రోజులలో రామకృష్ణుడికి కాన్సర్ వచ్చి ఒక ఆరు నెలలు బాధపడినప్పుడు, అద్భుతంగా సేవ చేసాడు. నేను మీ సేవకుడిని అనేవాడు. మనకు నెలకి పదివేల రూపాయలు జీతం ఇచ్చినా ఆ పని చేయలేము. జీతం పుచ్చుకొని పనిచేయటం వేరు, ప్రేమతోటి పని చేయటం వేరు. మహాజ్ఞాని, లోకానికి గురువు అని చెప్పుకునే రామకృష్ణుడు, ఒకగంటలో శరీరం విడిచిపెడతాడు అనగా అద్భుతానందతో ఏమన్నాడు అంటే, 'లాటూ నువ్వు నా శరీరానికి చేస్తున్న సేవ చూస్తుంటే నాకు చనిపోవాలని లేదు, శరీరం విడిచిపెట్టి బయటికి వెళ్ళాలని లేదు, నన్ను ఇంక బయటికి వెళ్ళనివ్వవా! ప్రారబ్ధం ప్రకారం నాకు శరీరాన్ని విడిచిపెట్టే టైం వచ్చేసింది. కాని నీ సేవ చూస్తే నిన్ను కళ్ళతోటి చూసుకోవటానికి ఇంకా కొంతకాలం ఈ ఇహములో ఈ లీలలో ఉండాలి, ఈ రోగంతోటి పోరాడాలి

అనిపిస్తోంది నాకు. నీ సేవ ముందు ఈ కాన్సర్ బాధ కూడా మరిచిపోయాను అంటాడు. అది అకారణ సేవ! జీతం పుచ్చుకోవటం వల్ల సేవ కాదు – అవుట్ అఫ్ లవ్, అవుట్ అఫ్ కంపాషన్!

అద్భుతానంద అంటాడు – నాకేమీ చదువు రాదు, నేను ఏదో పుస్తకాలు చదువుకొని ఉపనిషత్తులు చదువుకొని, అది చేసి ఇది చేసి, జపం చేసి అలా నేను పవిత్రుడిని అవ్వలేదు. గురువుకి సేవ చేసి పవిత్రుడిని అయ్యాను. దానివల్ల ఆధ్యాత్మికమైనటువంటి ఒక ఔన్నత్యం, ఒక ఉన్నతి నాకు వచ్చింది. అంటే సేవ వల్ల ఆ జీవితంలోనే ఆయన తరించాడు, పవిత్రుడు అయ్యాడు, గురువులో ఐక్యమయ్యాడు. వాడు ఎంత అద్భుతమైన సేవ చేసాడు అంటే, ఆ కాన్సర్ బాధ ఉన్నా పరవాలేదు, కాని నువ్వు చేస్తున్న సేవ విడిచిపెట్టి ఈ శరీరం విడిచిపెట్టి బయటికి వెళ్లాలని లేదు, ఇంకా కొంత కాలం భూమి మీద ఉండాలని ఉంది అంటాడు. రామకృష్ణుడి నోటివెంట వచ్చిన మాట ఇది. ఇక్కడ మనం నేర్చుకోవలసింది ఏమిటంటే, అద్భుతానందది వ్యాపార భక్తి కాదు. యజమాని వెయ్యి ఎకరం సంపాదిస్తే వెనకాల వాళ్ళు వీడెప్పుడు చస్తాడా అని కనిపెట్టుకొని ఉంటున్నారు. వ్యాపారంతోటి సంబంధం లేని ప్రేమ అద్భుతానందది. మనోదేహములు అంకితమై చేయటం.

అప్పుడు రామకృష్ణుడు ఆయనకి ఒక వరం ఇచ్చాడు. అద్భుతానందా నువ్వు తరించినా, మళ్ళీ లీలలోకి నీకు ఎప్పుడు రావాలనుకుంటే, అప్పుడు వస్తూ ఉండు మళ్ళీ నిత్యంలోకి వెళ్తావుండు అంటాడు రామకృష్ణుడు. అంటే పుట్టమని కాదు, ఒకవేళపుడతావనుకో, పుట్టినా ఈ మాయ అనే వలలో పడవు, ఈ లీలలోకి వచ్చినా, ఈ లీల నిన్నేమీ ఆకర్షించదు అని చెప్పాడు. ఒక వేళ లీలలోకి వస్తే, మళ్ళీ శరీరం వచ్చేస్తే మళ్ళీ మాయలో పడిపోతానేమో, సంసారంలో పడిపోతానేమో, భ్రాంతిలో పడిపోతామేమో అని భయపడేవాడికి, అది ఒక మోక్షమా, అది ఒక శాంతా, అది ఒక వైరాగ్యమా, అది వివేకమా, అది జ్ఞానమా? తుమ్మితే ఊడిపోయే ముక్కుని ఎంత సేపు పెట్టుకుంటావు నువ్వు అంటాడుఅద్భుతానంద. ఛాలెంజ్ అన్నమాట అది! ఈ లీలలోకి తొంబై సార్లు వచ్చినా ఈ

మాయ నిన్ను చుట్టుకోకూడదు. నువ్వు ఎక్కడ ఉంటే అక్కడినుంచి మాయ పారిపోవాలి. మాయ నిన్ను చూస్తేనే పారిపోవాలి, ఎన్ని సార్లు పుట్టినా మాయతో నీకేమీ ఇబ్బంది లేదు. అటువంటి వరం ఇస్తున్నాను నీకు అంటాడు రామకృష్ణుడు. అంటే దాని అర్థం ఏమిటంటే, నీకు ఆకర్షించే వస్తువులు ఎదురుగా ఎన్ని ఉన్నా, అయ్యబాబోయ్ ఈ వస్తువులు అన్నీ మనకి ఆకర్షణగా ఎదురుగా కనిపిస్తున్నాయి, వీటి ఆకర్షణలో పడిపోతాను అనే భయం కనుక నీకుంటే, అది పరమ జ్ఞానం కాదు. అది చివరి స్థితి కాదు. ఎన్ని భోగ వస్తువులు నీ చుట్టూ ఉన్నా నీకు వికారం ఎప్పుడైతే కలగదో, అప్పుడే అది నిజమైన జ్ఞానం అని చెప్పటం

అద్భుతానందకి చదువు లేదు, అయితే భగవంతుడు వాడికిచ్చే తెలివితేటలు ఇచ్చాడు. ఎవరైనా రామకృష్ణపరమహంస గారి దగ్గర పేపర్ తీస్తే ఊరుకొనే వాడు కాదాయన. . ఇదేంటి ఇక్కడికొచ్చి న్యూస్ పేపరులు చదువుతారు, ఇంటి దగ్గర చదువుకోండి. ఇక్కడికొస్తే జపం చేసుకోవాలి, ధ్యానం చేసుకోవాలి, విచారణ చేసుకోవాలి, గురువుగారి మాటలు వినాలి, మీకు తెలియని సబ్జెక్టు ఉంటే అడగాలి, లేకపోతే భగవంతుడికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోవాలి. ఆ లోకంలో గొడవలు న్యూస్ పేపర్ తెచ్చి ఇక్కడ చదవటం ఏమిటి, బయటికి పొమ్మనేవాడు. ఆయనకి చదువు లేకపోయినాఅటువంటి మాటలు అనేసేవాడు. ఎందుచేతనంటే ఆయనకి కపటం లేదు. కల్మషం లేదు మీరు ఏమనుకుంటారో గొడవ లేదు. గురువుగారి అనుమతి లేకుండానే చెప్పేసేవాడు, యు గో అవుట్ అని. ఆ గురువుగారికి బాకా వాడే, బూరా వాడే. వాడికి చదువు లేకపోవటం గురువుగారికి కలిసివస్తోంది! దీని అర్థం ఏమిటంటే, పవిత్రత ఉంటే చదువులతోటి సంబంధం లేదు మీకు మోక్షం రావటానికి. అద్భుతానంద ప్రేమ ఎటువంటిదంటే, నీ ప్రేమ, నీ సేవాభావం, నీ ఆప్యాయత చూస్తూ వుంటే, నా దేహం కాన్సర్ తోటి బాధపడుతున్నా, ఇంకా కొంతకాలం ఉందాము అనిపిస్తోంది అద్భుతానందా! అంటాడు రామకృష్ణుడు. అంటే నోటితో చెప్పే ప్రేమ, ఆప్యాయత కాదు!

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 5 డిసెంబరు 1995, తుని

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నేను అనే తలంపుని విచారణ చేస్తే దాని సోర్స్‌లోకి అది వెళ్ళిపోతుంది. నేను అనే తలంపుని నువ్వు ఉపసంహరిస్తుంటే అది ఎక్కడైతే పుట్టిందో, అక్కడకి వెళుతుంది. మాకు మోక్షానికి వెళ్ళాలి అని ఉందండీ అని ఒక అమ్మగారు భగవాన్‌తో అంటే వచ్చిన దారిన వెళ్ళిపో, నువ్వు మోక్షానికి వెళ్ళిపోతావు అన్నారు. రమణమహర్షి గారు మంత్రాలు, తంత్రాలు ఎక్కువ చెప్పేవారు కాదు ఇటువంటి మాటలు ఎక్కువ చెప్పేవారు. మీరు అందరూ వచ్చిన దారిన వెళితే ఎక్కడకు వెళతారు? మీ ఇంటికి వెళ్ళిపోతారు. అంతే కదా. అలాగే నేను అనే తలంపు ఎక్కడ నుంచి వచ్చింది? మీ హృదయం లోంచి వచ్చింది. ఆ నేను అనే తలంపు లోంచి ఇతర తలంపులు తొంభై వస్తున్నాయి అది వేరే విషయం. నేను అనే తలంపు ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడకు పంపేస్తే అది దాని పుట్టింటికి వెళ్ళిపోతుంది. అంటే హృదయంలోనికి వెళ్ళిపోతుంది. అది దాని నిజమైన ఇల్లు. ఆ ఇంటికి ఎవడు వెళ్ళాడో, వాడు మళ్ళీ శవాలను మోయక్కర్లేదు. ఇప్పుడు మనం అందరం తలొక శవం మోసుకుంటున్నాం కదా. అందరికీ తలొక దేహం ఉంది, అందరం తలొక శవం మోసుకుంటున్నాం. దీనికి రెండు పూటలా అన్నం పెడుతున్నాం . ఉదయం ఒకసారి స్నానం, సాయంత్రం ఒకసారి స్నానం, మళ్ళీ రోగం వస్తే ఆసుపత్రికి తిప్పుతున్నాం, ఈ దేహానికి చేసే చాకిరి ఇంతా అంతా కాదు అన్నారు భగవాన్. ఈ శవానికి చనిపోయే వరకు చాకిరీ చెయ్యవలసిందే. ఈ శవానికి మీరు ఎంత చాకిరి చేస్తున్నారో మీరు అందులో సగం ప్రయత్నం చేసినా మీకు దేవుడు తెలియబడతాడు అన్నారు.

మహాత్మాగాంధీ గారు మూడు కోతుల బొమ్మని ఆయన టేబుల్ మీద పెట్టుకునేవారు. దానిలో ఒక కోతి ఏమి చేస్తుంది అంటే కళ్ళు మూసుకుంటుంది, అంటే చెడు చూడవద్దు అని. మరో కోతి ఏమి చేస్తుంది అంటే చెవులు మూసుకుంటుంది, చెడు వినవద్దు అని. ఇంకో కోతి ఏమి చేస్తుంది అంటే నోరు మూసుకుంటుంది, చెడు మీరు మాట్లాడవద్దు అని. అంటే ఎవరైనా చెడు మాటలు చెప్పుకుంటుంటే మీకు వినాలని ఉంది అనుకోండి, ఆ చెడు మీలో ఉందని అర్ధం. మీలో ఉంది కాబట్టి వినాలి అనిపిస్తుంది. దానిని బట్టి ఆ చెడు మీకు పెరిగిపోతూ ఉంటుంది. చెడు మీకు చూడాలి అనిపిస్తుంది అనుకోండి, మీ లోపల చెడు ఉంది కాబట్టి మీకు చూడాలి అనిపిస్తుంది. మీరు పెద్ద పెద్ద సాధనలు, విచారణలు, ఉంటే తరువాత చేయవచ్చు. ముందు ప్రాథమికంగా ఇది చెయ్యమన్నారు గాంధీగారు. అంటే మీరు చెడు మాటలు వినవద్దు, చెడు విషయాలు కళ్లతోటి చూడవద్దు, చెడు మాటలు నోటి తోటి మాట్లాడవద్దు. అందుచేత ఒక్క ఆత్మ గురించి, భగవంతుడు గురించి తప్పించి ఏది మాట్లాడినా రమణమహర్షి గారు అనేవారు ఆ గొడవ మాట్లాడమని మీతోటి ఎవరు చెప్పారు అని. ఇదంతా మీ మనసు చేసే గారడీ. అనవసరమైన విషయాలు రమణమహర్షి గారి దగ్గర ఎవరైనా ప్రస్తావించారు అనుకోండి, అసలు ఈ విషయాలు మాట్లాడమని నీతోటి ఎవరు చెప్పారు? నీ అహంకారం అలా చేస్తోంది. అందుచేత ఆయన అక్కడికక్కడ కట్‌చేసేసేవారు. సబ్జెక్టు తప్పించి అనవసర విషయం ఏది వచ్చినా అది అక్కడికక్కడ కట్ చేసేవారు. అంటే మనం రోగం వచ్చిన తరువాత మందులు వాడి ఆ రోగం తగ్గించుకోవటం కంటే, అసలు రోగం రాకుండా చూసుకోవడం మంచిది. మీకు కోరిక వచ్చిన తరువాత ఆ కోరికను నిగ్రహించుకోవడంకంటే, కోరిక రాకుండా చూసుకోవడం మంచిది. ఇక్కడ చెప్పేది అది.

రమణమహర్షి గారు ఏమన్నారు అంటే సృష్టిలో ఈ భూమి మీద ఉన్న అన్ని

ప్రేమల కంటే తల్లి ప్రేమ గొప్పది. నేను అది కాదు అనడం లేదు కానీ అరుణాచలేశ్వరుడా, నా పట్ల నువ్వు చూపించిన ప్రేమను బట్టి చూస్తే తల్లి ప్రేమ కూడా సరిపోదు. మాములుగా వ్యవహారరీత్యా చూస్తే తల్లి ప్రేమ గొప్పదే కానీ నువ్వు నా పట్ల చూపించిన ప్రేమ, నువ్వు నా పట్ల చూపించిన ఆప్యాయతను బట్టి చూస్తే తల్లి ప్రేమ కూడా సరిపోదు, నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమా అన్నారు. అట్టిది నీ ప్రేమ. కనిన జనని కన్న ఘనదయాదాయకాఅంటే తల్లి ప్రేమ కంటే గొప్ప ప్రేమ కలవాడవు. నీ అనుగ్రహం ఇట్టిదా? నీ దయ ఇట్టిదా? ఓ అరుణాచలేశ్వరుడా నీ ప్రేమ ఇట్టిదా? అని అడుగుతున్నాడు. అక్షరమణమాలలో అరుణాచలేశ్వరుడిని అడ్రస్ చేసి, నీ ప్రేమని మాటల తోటి వర్ణించలేము. చేతుల తోటి రాయలేము. ఎవడి హృదయానికి వాడికే తెలియాలి . అంటే అనుభవం అనేది మన నోట్లో కలగదు, అనుభవం అనేది మన తలకాయలో కలగదు, అనుభవం అనేది మన చేతులలో కలగదు. భగవదనుభవం అనేది మన హృదయంలో కలుగుతుంది. ఎక్కడ కలుగుతుంది? మన హృదయంలో కలుగుతుంది. తెలివితేటలు కూడా అవసరమే, తెలివి తేటలు లేకపోతే బ్రతకటం కష్టం. అయితే ఆ తెలివి తేటలు మన హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవడానికి అనుకూలంగా ఉపయోగించుకోవాలి. చేతిలో డబ్బు ఉంది అనుకోండి, ఆ డబ్బు తోటి చెడు చెయ్యవచ్చు, మంచి చెయ్యవచ్చు. అదే విధంగా



**మనము కూర్చుని మాట్లాడుకునే మాటలు వ్యవహారిక నిజం. నిజానికి ఈ మాటలు అన్నీ అబద్ధము. బ్రహ్మము ఒక్కటే నిజము.**

మనకి ఏదైనా శక్తి ఉంటే దానితో చెడు చెయ్యవచ్చు, మంచి చెయ్యవచ్చు. అదే విధంగా మనకి ఏవైనా తెలివి తేటలు ఉంటే ఆ తెలివి తేటలతోటి చెడు చెయ్యవచ్చు, మంచి చెయ్యవచ్చు. ఇక్కడ రమణమహర్షి గారు ఏమని చెబుతున్నారు అంటే నీకు తెలివి తేటలు ఉండడం మంచిదే. తెలివి తేటలు లేకుండా ఉండడం కంటే ఉండడమే మంచిది. కానీ ఆ తెలివి తేటల తోటి నీ హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. ఆ తెలివి తేటలని అందుకు ఉపయోగించుకో, నీకు భగవంతుడు ఏదైనా శక్తి ఇస్తే ఆ శక్తిని నువ్వు సద్వినియోగం చేసుకో, దానివల్ల నీకు పుణ్యం వస్తుంది. పుణ్యం జ్ఞానం సంపాదించుకోవడానికి సహకరిస్తుంది.

ఒకరు రమణమహర్షి గారిని "మన హృదయంలో సత్యవస్తువు ఉంది, దేవుడు ఉన్నాడు అంటున్నారు కదా! ఉంటే మనకి అనుభవంలోకి రావడం లేదు ఏమిటి?" అని అడిగారు. నీ వాసనల యొక్క వేగం వల్ల, నీ తలంపుల యొక్క వేగం వల్ల, నీ అలవాట్ల యొక్క వేగం వల్ల నీకు ఆ వస్తువు తెలియటం లేదు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. కానీ నీ అలవాట్లు సరైనవి కావు. నీ ఆలోచనా విధానం సరిగ్గా లేదు, సమంగా లేదు. నీ అలవాట్ల యొక్క వేగం వల్ల, నీ ఆలోచనా ధోరణిలో ఉన్నటువంటి దోషాల వల్ల, నీకు ఆ వస్తువు తెలియటం లేదు కానీ లేకపోవటం వల్ల కాదు. నీ అలవాట్లే నిన్ను బంధించి ఉంచాయి, ఎవరో ఇతరులు కాదు. నీ అలవాట్లు, నీ వాసనలు, నీ తలంపులు నీకు సంకెళ్ళు. అవే నీకు బంధాలు. వాటి లోంచి నువ్వు విడుదల పొందితే వస్తువు నీకు ప్రత్యక్షం అవుతుంది. రమణమహర్షి గారు తరచుగా ఒక మాట చెప్పేవారు. నువ్వు ప్రత్యక్షంగా ఉన్న వస్తువుని అప్రత్యక్షం చేసుకుని దేవుడు లేడు అంటే ఎవరు ఏమి చెబుతారు అన్నారు. ఎంత అద్భుతమైన సమాధానమో చూడండి. వస్తువు ప్రత్యక్షంగా ఉంది. దానిని నువ్వే నీ దురలవాట్ల వల్ల అప్రత్యక్షం చేసుకుంటున్నావు. ప్రత్యక్షంగా ఉన్న వస్తువుని

అప్రత్యక్షం చేసుకుని లేదు అంటే దానికి ఎవరు చెబుతారు? మీరు ఆరోగ్య సూత్రాలు పాటించకుండా మాకు ఆరోగ్యం లేదు, ఆరోగ్యం లేదు అంటే దానికి ఎవరేమి చెబుతారు. అలాగే వస్తువు ప్రత్యక్షంగానే ఉంది. నీ అలవాట్లలో ఉన్న లోపాల వల్ల దానిని అప్రత్యక్షం చేసుకుని లేదు లేదు అనుకొంటున్నావు. నువ్వు లేదు అనుకున్నంత మాత్రం చేత ఉన్నది లేకుండా పోదు. ఉన్నది ఎప్పుడూ ఉంటుంది. లేదు లేదు అనుకుంటే ఎక్కడకి పోదు. దేవుడు అనేవాడు మన ఆలోచనల మీద, మన తలంపుల మీద, మన సంకల్పాల మీద ఆధారపడి లేదు. ఉన్నవాడు ఎప్పుడూ ఉంటాడు. నువ్వు ఉన్నాడు అనుకున్నప్పుడు కూడా ఉంటాడు. లేదు అనుకున్నప్పుడు కూడా ఆయన ఉంటాడు. అంటే ఉన్నవాడు ఎక్కడకీ వెళ్ళడు. మనకి ఏదో కోపం వచ్చినంత మాత్రం చేత దేవుడు ఎక్కడికో వెళ్ళిపోడు. ఆయన సాక్షి మాత్రుడు. ఆయన అంతా చూస్తూనే ఉంటాడు!

ఆదిశంకరాచార్యుల వారు ఏమని చెప్పారు అంటే, సూర్యుడిలో చీకటి లేదు. ఆత్మలో అజ్ఞానం లేదు. సూర్యుడికి ఎప్పుడైనా చీకటిని చూడాలి అనే బుద్ధి పుట్టింది అనుకోండి, ఆయన ఎక్కడకి వెళితే అక్కడికే వెలుగు వచ్చేస్తుంది, చీకటి కనబడదు. చీకటి ఎలా ఉంటుందో చూడనివాడు సూర్యుడు ఒక్కడే. సూర్యుడిని చూడడానికి మనకు దీపం కూడా అక్కర్లేదు, మన ముఖం అటు తిప్పితే సరిపోతుంది. అలాగే నీ హృదయంలో దేవుడు ఉన్నాడు, నీ ముఖం అహంకారం వైపు కాకుండా అటు తిప్పితే తెలుస్తుంది దేవుడు ఉన్నాడో, లేడో! నిజమైన ఆత్మలో అజ్ఞానం లేదు. మరి అజ్ఞానం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. మాయ అంతా ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. రాగద్వేషాలు ఎక్కడ ఉన్నాయి? మనస్సులో ఉన్నాయి. పూర్వ జన్మ సంస్కారాలు, పూర్వ జన్మ వాసనలు, పూర్వ జన్మ తలంపులు, పూర్వ జన్మ బంధాలు అన్నీ మన మనస్సులోనే ఉన్నాయి. ఇంకా కొన్ని వేలజన్మలు ఎత్తడానికి తగిన సామాగ్రి మనలో ఉంది. ఈ సామాగ్రి దేవుడి దగ్గర

జాగ్రత్త పెట్టలేదు, మన మనస్సులోనే జాగ్రత్త పెట్టేశాడు. మీకు అర్థం అవుతోందా? అంటే మనస్సు ఉన్నవాడికి మాయ, మనస్సు లేకపోతే మాయ ఏముంది? మనస్సు లేకపోతే మాయ లేదు, మనస్సు లేకపోతే అజ్ఞానం లేదు, మనస్సు లేకపోతే చీకటి లేదు, మనస్సు లేకపోతే పునర్జన్మ లేదు.

అక్షరమణమాలలో భగవాన్ ఏమని చెప్పారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! ఈ దేహం భౌతికమైన అగ్నికి ఆహుతి అవ్వకముందే, అంటే ఈ శరీరాన్ని వల్లకాటికి తీసుకెళ్ళి కాల్చేయకముందే, ఓ అరుణాచలేశ్వరుడా నీ జ్ఞానాగ్నిని పంపించి నా అహంభావాన్ని కాల్చేయ్ అన్నారు. ఓ అరుణాచలేశ్వరుడా, ఈ దేహం కాలిపోయిన తరువాత నీ వల్ల నాకు ఉపకారం ఏమిటి? దేహం చనిపోయిన తరువాత డాక్టరు వచ్చి ఏమి ఉపయోగం? అదే విధంగా ఓ అరుణాచలేశ్వరుడా ఈ దేహం చనిపోయిన తరువాత, అగ్నికి ఆహుతి అయిన తరువాత కూడా నువ్వు వచ్చి నన్ను రక్షిస్తావు అనుకుంటే నువ్వు మాత్రం ఎలా రక్షిస్తావు? భౌతికమైన ఈ శరీరాన్ని అగ్ని బూడిద చేయక ముందే నీ జ్ఞానాగ్నిని పంపించు. నీ జ్ఞానాగ్నిని పంపించి, నన్ను పవిత్రుడిని చేసి నీ స్వరూపాన్ని నాకు ఇవ్వు అరుణాచలేశ్వరుడా, నీ జ్ఞానాగ్ని పంపిస్తేనే కానీ నా అహంకారం కాలి బూడిద అవ్వదు. అందుచేత ఈ శరీరం బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి, నా మనస్సుని కాల్చి బూడిద చేయి. నా అహంభావనని కాల్చి బూడిద చెయ్యి. నా మనస్సు నన్ను మాయ చేసి ప్రకృతిలోకి పరుగెత్తి పోతోంది. నా మనస్సును నేను నిగ్రహించుకుందాం అని చూస్తున్నాను, దానిని కుదురుగా ఉండమంటున్నాను, ఊరక ఉండమంటున్నాను, గొడవలు పెట్టవద్దు అంటున్నాను. అది ఏమి చేస్తోంది? నన్ను మాయ చేసి బయటకి వెళ్ళిపోతోంది. అందరూ మనసుని కుదురుగా ఉండమని చెబుతారు. నువ్వు గొడవ చెయ్యకు, నువ్వు గొడవ చెయ్యకుఅని ఎవరి మనస్సుకి వాళ్ళు చెప్పుకుంటూనే ఉంటారు పాపం. అక్కడికి పూజలు చేసి, దేవుడి పటం ఎదురుగా

పెట్టుకుని, పీట వేసుకుని, నానా తిప్పలు పడతారు. దానికి తోడు పులి చర్మాలు ఒకటి, చేతిలో దండ పట్టుకుని పాపం ఈ తిప్పలు అన్నీ మనసుని కుదురుగా ఉండు అని చెప్పటం కోసమే. నేను కుదురుగా ఉండమని చెబుతున్నాను కానీ అది మాయ చేసి వెళ్ళిపోతోంది అరుణాచలేశ్వరుడా, ఇంతకీ నేను చెప్పేది ఏమిటి అంటే, నన్ను ఏ విధంగా అయితే నా మనస్సు మాయ చేస్తోందో, అలా నిన్ను కూడా మాయ చేసేలా ఉంది అరుణాచలేశ్వరుడా, నా మనసు నన్ను ఎలాగో మాయ చేసేస్తోంది. కానీ ఇప్పుడు ఈ మనస్సు గొడవ చూస్తూ ఉంటే నిన్ను కూడా మాయ చేసేసేలా ఉంది. రమణస్వామి అనే ఈ పిల్లకాయని ఎలాగో మాయ చేసేస్తోంది మనస్సు. ఇంతకీ రమణమహర్షి గారి భయం ఏమిటి అంటే, ఈ మనస్సు నన్ను ఎలాగో మాయ చేసేస్తోంది. దానిని వదిలేస్తే నిన్ను కూడా మాయ చేసేసేలా ఉంది. ముందు జాగ్రత్త కోసం నీకు ఒక సలహా చెబుతున్నాను. ఈ మనస్సు నిన్ను మాయ చెయ్యకుండా ఉండాలి అంటే, నువ్వు నా మనస్సు మీద కూర్చో, ఎక్కడో ఒకచోట నువ్వు కూర్చోవాలి కదా, వచ్చి నా మనసు మీద కూర్చో, నా మనసు మీద కూర్చుంటే ఇంక అది కదలదు. ఇంక నిన్ను మాయ చెయ్యడానికి వీలు లేదు. అంటే నిన్ను మాయ చేసి తప్పించుకుని పోవడానికి వీలు లేదు. అందుచేత నువ్వు స్థిరంగా కూర్చో, మళ్ళీ అటు ఇటు కదిలితే పక్కకి జారిపోతుంది. ఎంత జాగ్రత్తగా చెబుతున్నాడో చూడండి. రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే నా మనస్సు కదలకుండా నువ్వు ఉరుదిగా కూర్చో, స్థిరంగా కూర్చో. ఎవరి మీద? మనసు మీద కూర్చో, నువ్వు మనస్సు మీద స్థిరంగా కూర్చోవు అనుకో, అది నిన్ను కూడా మాయ చేసి బయటకి వెళ్ళిపోతుంది. నిన్ను మాయ చెయ్యకుండా ఉండడం కోసం నీకు సలహా చెబుతున్నాను అరుణాచలేశ్వరుడా, నువ్వు ఉరుదిగా కూర్చో, స్థిరంగా కూర్చో. నువ్వు నా మనస్సు మీద ఎంతసేపు కూర్చోవాలి అంటే నా మనస్సు పూర్తిగా అణిగిపోయే వరకు కూర్చోవాలి. అంటే అది పూర్తిగా నాశనం అయ్యేవరకు

నువ్వు కూర్చోవాలి. దానికి ఏమాత్రం ప్రాణం ఉన్నా నువ్వు లేచిపోయావు అనుకో మళ్ళీ దాని ప్రయాణం అది చేసేస్తుంది. దాని గంతులు అది వేసేస్తుంది. అంటే మనం అన్ని వాసనలు పోగొట్టుకున్నాం అనుకోండి, అన్ని దోషాలు పోగొట్టుకున్నాం అనుకోండి ప్రాణం పోయేటప్పుడు ఏదో ఒక చిన్న దోషం మనలో ఉంది అనుకోండి, ఆ చిన్న దోషం కూడా పునర్జన్మ తీసుకు వచ్చేస్తుంది. అంటే రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే శేషం రాకూడదు అంటున్నారు. శేషం రాకుండా మనస్సు నశించాలి. కొంచెం శేషం మిగిలింది అనుకో, ఆ శేషం మళ్ళీ నీకు జన్మని తీసుకుని వచ్చేస్తుంది. నిశ్శేషంగా మనస్సు నశించాలి. మనస్సు పూర్తిగా నశించేవరకు, దాని మూలంలో అది అణిగిపోయే వరకు నువ్వు మనస్సు మీదే కూర్చొని ఉండు, కదలకు నువ్వు. నువ్వు కదిలావు అంటే ఈ మనస్సు పక్కకి జారిపోతుంది. అందుచేత అరుణాచలేశ్వరుడా నువ్వు స్థిరంగా కూర్చోవయ్యా, మనస్సు ఎంతకాలం అయితే అణగలేదో, అంతకాలం అది అణిగిపోయే వరకు నా దగ్గరే ఉండు అరుణాచలేశ్వరుడాఅని రమణమహర్షి అనే పెండ్లికుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెండ్లి కుమారుడిని ప్రార్థిస్తోంది.

మనస్సులో ఉన్న గుణాలు బయటకి వ్యక్తం అవ్వటం కోసం మేటర్ ఒకటి ఉండాలి. అంటే physical body ఒకటి ఉండాలి. కరెంటు ఉన్నా బల్బు లేకపోతే మనకి ప్రకాశం రాదు. అదే విధంగా మైండ్‌లో ఉన్న గుణాలు express అవ్వాలి అంటే బాడీ ఉండాలి. మైండ్‌లో గుణాలు ఉన్నంత సేపు, మైండ్‌లో వికారాలు ఉన్నంత సేపు, వ్యక్తి భావన ఉన్నంత సేపు, individual "I" ఉన్నంత సేపు, లోపల mother thought ఉన్నంత సేపు, దానికేదో expression ఉంటుంది. మనకి ఏదో లోపం ఉంటే దానిని కక్కేయాలి అనిపిస్తుంది. ఏదో ఒక రోజు నిగ్రహించుకున్నా మరుసటి రోజు కక్కేస్తూ ఉంటాం. నిగ్రహం ఎన్ని రోజులు ఉంటుంది? ఒక రోజో, రెండు రోజులో ఉంటుంది. రెండు రోజులు దాచుకుని

మూడో రోజున కక్కేస్తూ ఉంటాం. అలాగే మైండ్‌లో ఉన్న గుణాలు బయటకి express అవ్వాలి అంటే దానికొక దేహం ఉండాలి. లోపల జీవలక్షణాలు ఉన్నంతసేపు శరీరం వచ్చేస్తుంది. ఆ శరీరం ద్వారానే జీవలక్షణాలు వ్యక్తం అవుతూ ఉంటాయి. శరీరం చనిపోకముందే జీవలక్షణాలు కనుక నాశనం అయితే వాడికి కొత్త శరీరం రాదు. అంటే దేహగతమైన నేను ఉన్నంతకాలం, దేహబుద్ధి ఉన్నంతకాలం, మరణించిన వాడు ప్రతీవాడు జన్మిస్తాడు, జన్మించిన ప్రతీవాడు మరణిస్తాడు.

రమణమహర్షి గారు ఏమని చెప్పారు అంటే సంసారం అంటే మీ ఇంట్లో ఉన్న మనుషులు కాదు, మీకున్న అహంకారమే సంసారం అన్నారు. అంటే అహంకారం ఉన్నంతసేపు జన్మలు వస్తాయి. మన శరీరం మరణించింది అనుకోండి, మరణించిన తరువాత కొత్త శరీరం వచ్చిన తరువాత పరిసరాలు మారతాయి, బంధువులుమారతారు, స్నేహితులు మారతారు, అంతేకానీ లోపల ఉన్న అహంకారం మారదు. నిజమైన సంసారం ఏమిటి అంటే మీ అహంకారమే నిజమైన సంసారం. సంసారం అహంకారంలో ఉంది, అహంకారం నశిస్తే సంసారం నశిస్తుంది. మనస్సు నశిస్తే సంసారం నశిస్తుంది. అంతేకానీ

**ఒక పని నీకు మంచి కింద అనిపించినా భగవంతుడు ఆ పనిని వద్దు అంటే దానిని వదిలేయాలి. ఎందుచేతనంటే నీ తెలివితేటలకు భగవంతుడు చెప్పింది అర్థం కాదు. మనం చేయవలసిన పని మానకూడదు. చేయకూడని పని చేయకూడదు. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అని నిర్ణయించేది నీ బుద్ధి కాదు, అది పరమాత్మ చెప్పాలి.**



ఇంట్లో ఉన్న వ్యక్తులను నువ్వు ద్వేషించక్కర్లేదు. నీ ప్రారబ్ధాన్నిబట్టి వాళ్ళు సిద్ధం అవుతూ ఉంటారు. నువ్వు జ్ఞానం సంపాదించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటే, మీ ఇంట్లో ఉన్న మనుషులు వచ్చి మీ పీక పట్టుకుంటారా? పట్టుకోరు. మీ ఇంట్లో ఉన్న వ్యక్తులు కాని, మీ బంధువులు కాని, మీ స్నేహితులు కాని మీ జ్ఞానానికి అడ్డురావటం లేదు. మీ అహంభావనే అడ్డు వస్తోంది. దానిని తొలగించుకుంటే మీకు జ్ఞానం కలుగుతుంది.

ఆదిశంకరాచార్యుల వారు ఒక మాట చెప్పారు. అది అద్భుతం, అది అపూర్వం, అది ఉదాత్తం. ఆయన ఏమని చెప్పారు అంటే, నీకు నిజంగా భక్తి కనుక కుదిరితే, నీకు కనుక భగవదనుభవం కుదిరితే, మొత్తం నీ సమస్త ఇంద్రియాల ద్వారా కూడా నీకు భగవంతుడే కనిపిస్తాడు అన్నారు. నీ శరీరంలో ఎన్ని ఇంద్రియాలు ఉన్నాయో, అన్ని ఇంద్రియాలకి దేవుడే కనిపిస్తూ ఉంటాడు నిజమైన భక్తుడికి. అంటే నీకు భక్తిభావన కనుక కుదిరితే, ఈశ్వరుడి తోటి అనుబంధం కనుక కుదిరితే, ఎవడైతే తన హృదయంలో భగవదనుభవం పొందాడో వాడికి అన్ని ఇంద్రియాల ద్వారా వాడికి దేవుడే కనిపిస్తూ ఉంటాడు అని ఆచార్యస్వామి వారు ఒక సందర్భంలో చెప్పారు. ఎంత వైభవంగా ఉందో చూడండి.

ఓ అరుణాచలేశ్వరుడా, నీ మీద నాకు ప్రేమ కలిగేటట్టు చేసుకో, నీ మీద ప్రేమ కలిగేటట్టు నువ్వు చేసుకోకపోతే నాకు చాలా ఆకర్షణలు ఉన్నాయి. నేను చాలా బిజీగా ఉంటున్నాను, నాకు ఈ లోకంలో చాలా attractions ఉన్నాయి. ఏ attraction అయినా లాగేస్తుంది అరుణాచలేశ్వరుడా, నాకు ఒక ఆకర్షణ కాదు. ఎదురుగా డబ్బు ఉంది, ఎదురుగా అధికారం ఉంది, ఇంకా అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఒక రకం ఆకర్షణ కాదు రకరకాల ఆకర్షణలు ఉన్నాయి. నేను ఏదో ఒక attractionలో పడిపోతాను. ఏదో ఒక

attractionలో ఎలాగో పడిపోతాను కాబట్టి నీ attraction నాకు చూపించవయ్యా అరుణాచలేశ్వరుడా అంటున్నాడు. నీ మీద ఆకర్షణ నాకు కలిగించవు అనుకో, నీ మీద ప్రేమ నాకు కలిగించవు అనుకో, నీ మీద మనసు నిలబడేటట్టు నువ్వు చెయ్యవు అనుకో, నేను ఏదో ప్రకృతి ప్రవాహంలో కొట్టుకుని పోతాను, మనిషి పాడైపోవడానికి ఒక్క చెడు అలవాటు చాలు, తొంభై చెడు అలవాట్లు ఉండక్కర్లేదు. లోకంలో ఒక రకమైన ఆకర్షణ కాదు తొంభై రకాల ఆకర్షణలు ఉన్నాయి. ఏదో ఒక ఆకర్షణలో నేను కొట్టుకుని పోతాను అంటున్నాడు. నీలో సుఖం ఉంది, కానీ అది నా సొంతం అవ్వడం లేదు. నీలో ఉన్న సుఖం నేను సొంతం చేసుకోవాలి అంటే నీ మీద నాకు ఇష్టం కలిగించాలి. ఎదుటివాడికి మన మీద ప్రీతి కలిగితేనే వాడి చేతిలో ఉన్న అరటిపండు మనకు ఇస్తాడు, వాడికి మన మీద ప్రీతి లేకపోతే అరటిపండు ఇవ్వడు. అంటే నీ మీద నాకు ప్రీతి కలుగజెయ్యి, నీ మీద నాకు ఇష్టం కలుగజెయ్యి. నీ మీద ఎప్పుడైతే నాకు ఇష్టం కలిగిందో, నా పట్ల నీకు అనుగ్రహం కలుగుతుంది. అనుగ్రహం కలిగితే అప్పుడు నీ సుఖం నాకు ఇచ్చేస్తావు. అంటే నువ్వు ఎటువంటి సుఖాన్ని పొందుతున్నావో, ఎటువంటి శాంతిని పొందుతున్నావో, నువ్వు ఎటువంటి ఆనందాన్ని పొందుతున్నావో అది నాకు ఇచ్చేస్తావు.

సర్వసాధారణంగా మనం ఎవరిని అయితే ప్రేమిస్తున్నామో, వాడిని మన అంతటి వాడిని చేయాలి అనిపిస్తుంది. అది నిజమైన ప్రేమ. అలా అనిపించకపోతే అది ప్రేమ కాదు దొంగ ప్రేమ. మీకు అర్థం అవుతోందా? మీరు మంచి అభివృద్ధిలో ఉన్నారు అనుకోండి మీ అబ్బాయిని కూడా మీ స్థితిలోకి తీసుకురావడం కోసం మీరు చూస్తారు. జ్ఞానికి, అజ్ఞానికి తేడా ఏమిటి అంటే అజ్ఞాని ఊరికే ఆ కుటుంబంలో నలుగురినే ప్రేమించుకుంటాడు. జ్ఞాని సృష్టిని అంతా ప్రేమిస్తాడు. అంటే అజ్ఞాని ప్రేమ పరిమితం అయినది. జ్ఞాని ప్రేమ అంతులేనిది. మామూలుగా దానికి హద్దులు లేవు. ఒక మతం

అని, కులం అని, దానికేమి హద్దులు ఉండవు. అందుచేత ఓ అరుణాచలేశ్వరుడా నీ యందు ప్రేమ కలిగేటట్టు నాకు చెయ్యి. నా మనస్సు నీ మీద స్థిరంగా ఉండేటట్టు చెయ్యి. అలా చేస్తే అప్పుడు నీ సుఖాన్ని నాకు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. భగవంతుడు కూడా ఏదో ఒక వంపు కోసం చూస్తూ ఉంటాడు. ఆ అమ్మగారికి నేనంటే ప్రేమగా ఉంది, ఆ అమ్మగారికి నేనంటే ఇష్టంగా ఉంది అని చెప్పటం కోసం ఏదో వంపు చూసి మీకు మోక్షాన్ని ఇచ్చేస్తాడు. ఇక్కడ భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే నీ యందు ప్రేమ నాకు కలిగేటట్టు చెయ్యి. రమణమహర్షికి మోక్షం ఎందుకు ఇచ్చారు? మాకు ఎందుకు ఇవ్వలేదు అని మనం అందరం అరుణాచలేశ్వరుడి మీద దెబ్బలాడతాం అని ముందే జాగ్రత్త పడుతున్నారు. నీ మీద నాకు ప్రేమ కలుగజెయ్యి. ప్రేమ కలుగజేసి అప్పుడు నీ సుఖాన్ని నాకు ఇచ్చేయ్. రమణమహర్షి గారు అంత సుఖి ఎందుకు అయ్యాడు? ఆయనకి ఎందుకు ఇచ్చావు అంటే ఆయన నన్ను ప్రేమించాడు కాబట్టి ఇచ్చానుఅని చెబితే గొడవ ఉ ండదు, లోకంలో నిష్టూరాలు రావు. అనుగ్రహించడం కోసం అరుణాచలేశ్వరుడికి ఏదో ఒక వంపు ఉండాలి. ఆ వంపు ఏమిటి అంటే నీ మీద నాకు ప్రేమ కలిగేటట్టుచేసి నీ సుఖాన్ని నాకు ఇచ్చేయ్, నీ శాంతిని నాకు ఇచ్చేయ్, నీ ఆనందాన్ని నాకు ఇచ్చేయ్ అంటున్నారు భగవాన్.

హృదయంలో ఉన్న ఆనంద సముద్రం, హృదయంలో ఉన్న శాంతి సముద్రం, హృదయంలో ఉన్నటువంటి శాంతి తరంగాలు ఒక్కసారి విజృంభించి పొంగి సహస్రారానికి కనుక వస్తే, అప్పుడు దేవుడు కనిపించినా దేవుడిని చూడాలి అని ఉండదు, అటువంటిది ఆ సుఖసముద్రం. బాహ్యంగా మీకు కనిపించే సముద్రంలో ఉప్పు ఉంది. హృదయ సముద్రంలో ఉప్పు కాదు సుఖం ఉంది. ఆ సుఖ సముద్రం పొంగి నీ శిరస్సుని ముంచినప్పుడు, బాహ్యంగావచ్చి దేవుడు కనిపించినా వాడిని కళ్లు ఎత్తి చూడాలి అనిపించదు. అంటే ఇష్టం

లేకపోవటం కాదు. ఆయనని చూడాలి అని మీకు అనిపించదు. అటువంటి సుఖసముద్రం నీలో ఉంది. ఆ సుఖసముద్రం పొంగటానికే, ఆ శాంతి సముద్రం పొంగటానికే నీకు ఈశ్వర అనుగ్రహం అవసరం. నీ అనుగ్రహం తోటి నన్ను కప్పు, నీ అనుగ్రహం తోటి నన్ను దీవించు, నీ స్వరూపాన్ని నాకు ఇయ్యి, నీ అనుగ్రహం నాకు ఇయ్యి. నీ అనుగ్రహం నాకు ఇవ్వలేదు అనుకో, నీ సుఖం కూడా నాకు రాదు, నీ శాంతి కూడా నాకు దొరకదు అంటున్నారు.

ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! పూర్వం అనేకమంది భక్తులు వచ్చారు. నీ యొక్క ఔన్నత్యం, నీ యొక్క ఘనత, అనేక గొప్ప గొప్ప మాటల తోటి, కవిత్వాల తోటి చెప్పారు. నాకు చదువు తక్కువ, పాండిత్యం లేదు, చిన్న చిన్న మాటల తోటి నిన్ను స్తోత్రం చేస్తున్నాను. ఈ స్తోత్రం ఎలా ఉంది అంటే, పాలు తాగిన తరువాత, కాఫీ తాగిన తరువాత మంచినీళ్ళు ఇస్తే ఆ నోటికి ఎలా ఉంటుందో, నా కవిత్వం కూడా నీకు అలాగే ఉంటుంది. నాకు చేతకానిది నేనెక్కడ చేయగలను? నాకు చేతనైన మాటల తోటే నీకు చెబుతున్నాను. అందుచేత నన్ను అనుగ్రహించి దీవించు. ఎవడో రమణమహర్షిని ఉద్ధరించాను అని చేతులు కడిగేసుకోకు. నా పని పూర్తి అయ్యిపోయింది అనుకోకు. ఎవరైతే నిన్ను ఆశ్రయిస్తున్నారో, ఎవరైతే నీ కరుణ కోసం ఎదురు చూస్తున్నారో, ఎవరైతే నీ దర్శనానికి వస్తున్నారో, రమణమహర్షిని ఎలా అయితే ఉద్ధరించావో, వాళ్ళని కూడా ఆశీర్వదించి, వాళ్ళని కూడా ఉద్ధరించి, వాళ్ళని కూడా జ్ఞాన సింహాసనం మీద కూర్చోబెట్టు అరుణాచలేశ్వరుడా, ఏదో ఒకడి పని పూర్తి చేశాం, ఒకడి రోగం తగ్గించేశాం, మిగతా వాళ్ళ గొడవ నాకు ఎందుకు అని అలా అనుకోకు. మిగతా వాళ్ళ రోగాలు కూడా తగ్గించు. ఎవడికో ఒకడికి అశాంతి పోగొట్టాం మిగతా వాళ్ళ అశాంతి గొడవ నాకు ఎందుకు అని అనుకోకు. మిగతా వాళ్ళ అశాంతిని కూడా పోగొట్టు అంటున్నారు.

అరుణాచలేశ్వరుడా నా శరీరం పోయినా ఫరవాలేదు. నువ్వు చిరకాలం, కలకాలం ఉండు. నువ్వు మటుకు స్థిరంగా ఉండు. ఎందుచేత అంటే నువ్వు అందరినీ ఆశీర్వదించాలి, జ్ఞానులుగా తయారు చెయ్యాలి. నీ స్వరూపం వాళ్ళకి ఇవ్వాలి అరుణాచలేశ్వరుడా. కాని నీ దగ్గర ఒక గుణం ఉంది, ఎవరికి ఏది చేసినా రహస్యంగా చేసేసే అలవాటు నీకు ఉంది. ఎవరిని అనుగ్రహించినా, పక్క వాడికి కూడా తెలియనివ్వడు. ఇప్పుడు ఎల్లమ్మ గారిని అనుగ్రహిస్తున్నాడు అనుకోండి, ఆ పక్కవాడికి కూడా అనుగ్రహించినట్టు అరుణాచలేశ్వరుడు తెలియనివ్వడు. అరుణాచలేశ్వరుడి nature అది. మంచో, చెడ్డో వదిలేయండి. ఎవడినైతే అనుగ్రహిస్తున్నాడో వాడి పక్కోడికి కూడా తెలియనివ్వడు. పని బానే చేస్తావు నువ్వు, పని చెయ్యటంలో పొరపాటు ఏమి లేదు. కానీ నీ దగ్గర ఒక గుణం ఉంది. నువ్వు చేసే పని ఆడంబరంగా చెయ్యవు. నెమ్మదిగా, సైలెంట్‌గా చేసుకుపోతావు. కానీ నేను పొరపాటు చేస్తున్నాను, నువ్వు సైలెంట్‌గా చేసే పని నేను అందరికీ తెలియజెప్పేస్తున్నాను. అరుణాచలేశ్వరుడు చేసే పని రహస్యంగా చేస్తాడు అని అందరికీ వ్యక్తం చేసేస్తున్నాను. నేను వ్యక్తం చెయ్యడం కూడా నీకు ఇష్టం ఉండదు అన్న సంగతి నాకు తెలుసు. నీకు ఇష్టం లేని పని చేస్తున్నందుకు నన్ను క్షమించి ఆశీర్వదించు అరుణాచలేశ్వరుడా. నేను తప్పు చేస్తున్నాను. నీ యొక్క గొప్పతనం ఇతరులకి చెప్పడం నీకు ఇష్టం ఉండదు. నీ వల్ల ఎవరికైనా ఉపకారాలు జరిగితే, ఆ ఉపకారం అరుణాచలేశ్వరుడి వల్ల జరిగింది అని చెప్పడం కూడా నీకు ఇష్టం ఉండదు. నీకు ఇష్టం ఉండదు అన్న సంగతి నాకు తెలుసు, అలా చెప్పడం వల్ల కూడా నీకు కష్టం తోస్తుంది అన్న సంగతి తెలుసు. కానీ నువ్వు రహస్యంగా చేసే పని పది మందికి అర్థం అయ్యేలా చెబుతున్నాను , నేను చేస్తున్న పని నీకు ఇష్టం ఉండదు అన్న సంగతి తెలిసుండే చేస్తున్నాను. అందుచేత నువ్వు మరొక రకంగా అనుకోవద్దు. నన్ను క్షమించి ఆశీర్వదించు అరుణాచలేశ్వరుడా.

సర్వసాధారణంగా మనం డాక్టరు దగ్గరకి వెళితే వాళ్ళు ఏమి చేస్తారు అంటే మందు రాసి ఇస్తారు. మందు రాసి ఇచ్చి ఫలానా కొట్లో కొనుక్కోండి అంటారు. రమణమహర్షి అరుణాచలేశ్వరుడితో ఏమంటున్నాడు అంటే ఈ కొనుక్కోవడాలు నా దగ్గర కుదరవు. డాక్టరు నువ్వే, మందు నువ్వే. నాకు ఏ రోగం ఉందో నువ్వే చెప్పాలి, ఆ రోగానికి మందు నువ్వే ఇవ్వాలి అంటున్నారు. మళ్ళీ నాకు మందు రాసిచ్చి నన్ను కొట్ల వెంట తిప్పకయ్యా అరుణాచలేశ్వరుడా, నాకు ఏ రోగం ఉందో నువ్వే చెప్పాలి, ఆ మందు కూడా నువ్వే ఇవ్వాలి, వైద్యుడు చేసే పని నువ్వే చెయ్యాలి, ఆ మందు చేసే పని కూడా నువ్వే చెయ్యాలి. ఇవి రెండు కూడా నువ్వే చెయ్యాలి అరుణాచలేశ్వరుడా! ఇప్పుడు డాక్టరు గారి దగ్గరకు మనం వెళ్లాం అనుకోండి, వెళితే నీకు ఫలానా రోగం ఉంది అని చెప్పేసి ఆ డాక్టరు గారు రోగం తగ్గే విధానం చెబుతారా? వెళ్లి రమ్మంటారా? వెళ్లి రమ్మనరు. ఈ రోగానికి పత్యం ఇలా చెయ్యి. ఈ మందు ఇలా వాడు నీకు తగ్గుతుంది అని చెబుతారు. అలాగే నాలో నిజంగా ఏదైనా దోషం ఉందనుకో, ఆ దోషాన్ని నువ్వే తొలగించాలి. మళ్ళీ ఆ దోషాన్ని తొలగించి మంచి గుణం తోటి నన్ను అలంకరించాలి. నాలో చెడు గుణాలు ఉంటే వెళ్లిరా అని నువ్వు అనకు. ఆ చెడు గుణాలు తీసేసి మంచి గుణాలు తోటి నన్ను అలంకరించవయ్యా! ఇపుడు మనకి ఏదైనా కురుపు చీము కారుతుంది అనుకోండి, చీము తీసేసి వదిలెయ్యం.



**ఇతరులకు మీ పట్ల అసూయ ఉన్నా, మీరు మాత్రం వారికి ప్రేమ, ఆప్యాయతలనే పంచిపెట్టాలి. దాని వలన మనస్సు పలుచబడుతుంది.**

దానిని శుభ్రంగా స్పిరిట్ తోటి కడిగి మళ్ళీ కట్టు కడతారు. అదే విధంగా నాకు ఏవైనా చెడు గుణాలు ఉంటే తొలగించేయ్. ఆ చెడు గుణాల స్థానంలో మంచి గుణాలు ఏర్పరచు. ఎందుచేత? గుణము జ్ఞానం కాదు. బాగా అర్థం చేసుకోండి. జ్ఞానం ఆత్మలో ఉంది, గుణం మనసులో ఉంది. గుణం జ్ఞానం కాదు. కానీ జ్ఞానాన్ని సంపాదించడం కోసం మంచి గుణం సహకరిస్తుంది. అందుకే మంచిగా ఉండమని చెబుతారు మీకు అందరూను. చెడుగా ఉంటే మీకు నష్టం ఏమిటి? మంచిగా ఉంటే మనలో ఉన్న మంచితనం భగవంతుడిని తెలుసుకోవడానికి సహకరిస్తుంది. చెడుతనం మనకి సహకరించదు, అది మనలను పాడు చేస్తుంది. మంచి గుణాలు ఎందుకు అంటే భగవంతుడిని తెలుసుకోవడానికి సహకారం చేస్తాయి అందుచేత చెడు గుణాలు అన్ని తీసేసి మంచి గుణాలు నాలో ఉండేటట్టు నువ్వు అనుగ్రహించవయ్యా, నాలో చెడు గుణాలు తీసే బాధ్యత నీదే. మంచి గుణాలు కలిగేటట్టు చేసేది నువ్వే. నన్ను అనుగ్రహించవలసిన బాధ్యత అంతా నీదే. అంతా నువ్వే చూసుకో అరుణాచలేశ్వరుడా!

నాకు శరణాగతి ఒక్కటే గతి. నాకు స్నేహితులు లేరు, నాకు బంధువులు లేరు, నాకు అనుచరులు లేరు, నా అనేవాళ్ళు ఇక్కడ ఎవరూ లేరు. నిన్ను నమ్మి ఇంతదూరం వచ్చాను. నాకు వెనకాల ఎవరైనా స్నేహితుల సపోర్ట్ ఉంది అనుకుంటున్నావు ఏమో, బంధువుల సపోర్ట్ ఉంది అనుకుంటున్నావు ఏమో, నాకు అంగ బలం లేదు, నాకు అర్థ బలం లేదు. నువ్వే నాకు బలం, నువ్వే నాకు శాంతి, నువ్వే నాకు సుఖం, బయట నాకు ఏమి సపోర్ట్లు లేవు. నాకు ఏమైనా ఆస్తి ఉంటే నువ్వే ఆస్తి. నాకేమి అంగ బలం, అర్థ బలం లేదు , నువ్వు ఎక్కడ ఉంచినా, నిప్పులో పెట్టినా, నీటిలో ముంచినా బాధ్యత నీదే ఓ అరుణాచలేశ్వరుడాఅని ఈరమణమహర్షి అనే పెళ్లి కుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెళ్లి కుమారుడిని శరణు వేడుకుంటోంది. ఈ లోకంలో నాకు నువ్వు తప్పించి పొందదగినది

అంటూ ఏది లేదు. ఇక్కడ శరణాగతి చూపిస్తున్నాడు. నువ్వే నాకు సాధన, నువ్వే నాకు గమ్యం. భౌతికమైనవి ఏవి కూడా నేను అడగవలసిన పని లేదు, నాకు ఏమి అక్కర్లేదు కాబట్టి, నువ్వే సాధన, నువ్వే గమ్యం. ఓ అరుణాచలేశ్వరుడా ఈ బిడ్డని ఆశీర్వదించవయ్యా, నీ అనుగ్రహం అనే దుప్పటి తోటి నన్ను కప్పవయ్యా అరుణాచలేశ్వరుడా అని రమణమహర్షి అనే పెళ్లి కుమార్తె, అరుణాచలేశ్వరుడు అనే పెళ్లి కుమారుడిని ప్రార్థిస్తోంది.

**శివ శివ అరుణాచల శివాయ జై జై, శివ శివ అరుణాచల శివాయ జై జై, శివ శివ అరుణాచల శివాయ జై జై, శివ శివ అరుణాచల శివాయజై జై, జై జై, జై జై, శివ శివ అరుణాచల శివాయ.**

**ఓం ఓంఓంఓంఓం**

**శాంతిఃశాంతిఃశాంతిః**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 2-60**

**తాత్పర్యము:** ఓ అర్జునా! ఇంద్రియములు మహాశక్తివంతమైనవి. మనుష్యుడు వాటిని నిగ్రహించుటకు ఎంతగా ప్రయత్నించినను, ఆసక్తి తొలగిపోనంత వరకు అవి అతని మనస్సును విషయముల వైపు బలవంతముగా లాగుకొని పోవుచునే యుండును.

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః అంటేవివేకం గల పురుషుడు, చాలా తెలివి గలవాడు, చాలా పట్టుదల గలవాడు , తపస్సులు చేసేవాడు, మోక్షం కోసమే సాధన చేసే వాడి ఇంద్రియాలు కూడా వాడిని లాగేస్తున్నాయి. ఎవడైతే తెలివి గలవాడో, ఎవడైతే బుద్ధి మంతుడో, ఎవడైతే మోక్షాన్ని పొందటం కోసం సాధన చేస్తున్నాడో, వాడి ఇంద్రియాలు కూడా వాడిని లాక్కెళ్ళిపోతున్నాయి. మాములు మొద్దు అబ్బాయి మాట ఇంక ఎందుకు!

ఓ రామా, ఓ శ్రీ రామా, ఎంతటి వారైన కామీనీ, కాంచనాలకి దాసులే! అన్నాడు త్యాగరాజు. ఇంద్రియాణి ప్రమాథీని ఇంద్రియాలు నీకు చాలా కష్టం తీసుకు వస్తాయి. ఈ పేచీలు అన్నీ ఇంద్రియాల వల్లే. మనం సాధన చేస్తే, మనం చేసే సాధన కంటే

బలమైనవి ఈ ఇంద్రియాలు. మనం ప్రయత్నం చేస్తుంటే మనం చేసే ప్రయత్నం కంటే బలమైనవి ఇంద్రియాలు. మనకి ఒక కోటి రూపాయలు అప్పు ఉంది అనుకోండి, ఒక పదివేలు సంపాదించాము అనుకోండి, పదివేల తోటి కోటి రూపాయల అప్పు తీర్చగలమా? పదివేల సంపాదన ఎక్కడ, కోటి రూపాయల అప్పు ఎక్కడ! అదే విధంగా నువ్వు ఎంతో కొంత సాధన చేస్తున్నావు, నువ్వు సాధన చేస్తున్నప్పటికీ నీ సాధన కంటే ఇంద్రియాలకి బలం ఎక్కువ, నీ సాధన కంటే నీ అహంకారానికి బలం ఎక్కువ ఉంది. ఈ ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి అనుకుంటున్నావు. కాని బలవంతంగా నీ ఇంద్రియాలు నిన్ను లాక్కుపోతున్నాయి, బలాత్కారముగా మనస్సుని లాక్కుపోతున్నాయి. మీకు అర్థం అవుతోందా లౌకికుల మాట వదిలేయండి. సాధకుడి యొక్క మనసును కూడా, మోక్షాన్ని పొందాలి అనే కుతూహలం గల భక్తుడి యొక్క మనసుని కూడా, ఈ ఇంద్రియాలు హరిస్తున్నాయి, బయటకి లాక్కుపోతున్నాయి. మనకి ఇష్టం లేకపోయినా, మన ఇంద్రియాలు మన మనసుని, మనతో సంబంధం లేకుండానే బయటకి లాక్కుపోతున్నాయి. ఇంద్రియాలకి అంత శక్తి ఉంది. అందుచేత ఈ ఇంద్రియాల విషయంలో నువ్వు బహు జాగ్రత్తగా ఉండాలి.

మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. ఒకటి భోగం, రెండు యోగం, ఇవి రెండు ఒక ఇంట్లో కాపురం ఉండవు. ఈ రెండింటికి అసలు పడదు. తాత్కాలికంగా ఇవి రెండు ఒకే ఇంట్లో కాపురం ఉన్నా ఎక్కువ కాలం ఉండవు. అందుచేత నువ్వు భోగాన్ని జయించటం కోసం అన్నం నీళ్ళు మానేసి, నువ్వు కేవలం శరీరాన్ని శుష్కింప చేసినప్పటికీ, నువ్వు ఇంద్రియాలను జయించిన వాడివి కాదు. అంతమాత్రం చేత నువ్వు ఇంద్రియాలు జయించాను, నేను జ్ఞానిని అయిపోయాను అనుకుంటావేమో! అలా కుదరదు. గదిలో కుర్చుని తలుపులు వేసేసుకుని కాసేపు కృష్ణా, రామా అనుకుంటే నీ మనస్సు నిర్మలంగా ఉండవచ్చు. అంత మాత్రం చేత నువ్వు ఇంద్రియాలను జయించలేవు. భగవాన్‌కి ఇంద్రియాల గొడవ అక్కరలేదు, వేరే గొడవ అక్కరలేదు, ఒక్క ఆత్మ గొడవే! నీకెందుకు ఆ గొడవలు అన్నీ, ఆత్మని తెలుసుకో, ఆత్మని తెలుసుకుంటే ఇంద్రియాలు వాటంతట అవే పోతాయి అంటారు. కలెక్టరు గారిని పట్టుకుంటే రెవెన్యూ ఇన్స్పెక్టర్ నువ్వు చెప్పినట్టే వింటాడు కదా.

**(సేకరణ : సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-12-1985, కాపవరం)**



ది॥ 13-03-2024 బుధవారంనాడు శ్రీరమణక్షేత్రం జిన్నూరు నందు జరిగిన సద్గురు శ్రీ నాన్నగారి విగ్రహ ఆవిష్కరణ వార్షికోత్సవ దృశ్యమాలిక



# ఆరాధన

భగవాన్ శ్రీ రమణమహర్షి తారీఖు ప్రకారం ది॥ 14-04-1950న రాత్రి గం॥ 8-47ని॥లకు అరుణాచలక్షేత్రంలో తన పార్థివ శరీరాన్ని విడిచిపెట్టారు. ఆ క్షణం నుండి శరీరధారిగా భగవాన్ ఇక లేరు. భగవాన్ శరీరం విడిచిపెట్టిన సమయంలో ఒక దివ్యజ్యోతి నిర్యాణపు గది గోడను ఆనుకుని పయనిస్తూ అరుణగిరిలో ఐక్యమైంది. సెప్టెంబరు ఒకటి 1896న అరుణాచలక్షేత్రంలో అగుడుపెట్టినది మొదలు, చివరి శ్వాస విడిచిపెట్టే వరకు భగవాన్ అరుణాచలక్షేత్రాన్ని విడిచిపెట్టలేదు. తాను శాంతిగా నిష్క్రమించారు. భోజనం ముగించిన తరువాత విస్తరిని విసిరిపారేసినట్లే, జ్ఞాని తన శరీరాన్ని విసర్జిస్తారు. భగవాన్ ఇప్పుడు లేరు అనుకుంటే పొరపాటే, గురువంటే దేహము కాదు. దేహము పుట్టక మునుపు భగవాన్ ఉన్నారు, దేహముతో ఉన్నప్పుడు భగవాన్ ఉన్నారు, దేహము విడిచిపెట్టిన తరువాత భగవాన్ ఉన్నారు. భగవాన్ దేహం అయితే మటుకు ఇప్పుడు అది లేదు. ఆయన దేహముతో ఉన్నప్పుడు కూడా ఆయన ఆ దేహము కాదు. భగవాన్ అంటే నిరంతర ఉనికి, ఆదిమధ్యాంత రహిత చైతన్యం. దేహము మరణించిన తరువాత మనము ఉండము అనుకుంటాం, గాఢనిద్రలో మనకు దేహం ఎక్కడ ఉంది? గాఢనిద్రలో మనకు దేహముతోటి, లోకముతోటి, బంధువులతోటి, దేవుడుతోటి సంబంధం ఉందా? లేదు అన్నదే జవాబు. మరి దేనితోటి సంబంధం లేకపోయినా నేను లేకుండా పోతున్నానా? అంటే నేను ఉంటున్నాను. ఆ ఉన్న నేను ఎవరు అన్న విచారణ చేయాలి. నాకు తెలుసున్నా, తెలియక పోయినా నేను అంటే ఆత్మ. ఆ సత్యం అనుభవంలోకి వచ్చేవరకు దుఃఖము వెంటాడుతుంది. జనన మరణాలు వ్యవహారిక సత్యములు మాత్రమే. అవి దేశ కాలాలకు చెందినది. మన మనస్సు ఎంత నిజమో అవీ అంతే నిజం. పుట్టేది, తిరిగి మరణించేది దేహము మాత్రమే. ఏదైతే పుట్టిందో అది మరణించే తీరాలి. అంతటా వ్యాపించి యున్న సద్వస్తువు ఎక్కడికి వెళుతుంది? ఎక్కడ నుండి వస్తుంది? సత్యానికి రాకపోకలు లేవు. మనము చనిపోయే దేహంతో తాదాత్మ్యం చెందుతున్నామా? చావులేని సత్పదార్థంతో తాదాత్మ్యం చెందుతున్నామా? అన్నదే ముఖ్యం. భగవాన్ తన 17వ ఏటనే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొంది మృత్యుంజయుడయ్యాడు. నిరహంకార స్థితిని పొందినవారే నిర్వాణ స్థితిని పొందుతారు. జ్ఞాని శరీరాన్ని విడిచిపెట్టడం అంటే మృత్యుంజయుడు శరీరాన్ని విడిచిపెట్టడం, దానినే 'మహానిర్వాణం' అంటారు.

**(తారీఖు ప్రకారం ది॥ 14-04-2024 భగవాన్ ఆరాధన సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**